సాక్షి
మెదక్
శుక్రవారం, 25, ఏప్రిల్, 2025



శివ్వంపేట: కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలు

అకాల వర్షం.. ఆగమాగం

- కల్లాలను ముంచెత్తిన వరద
- పలుచోట్ల కొట్టుకుపోయిన ధాన్యం

అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. గురువారం సాయంత్రం జిల్లాలోని పలు మండలాల్లో కురిసిన వర్షానికి ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధా న్యం వర్షపు నీటిలో కొట్టుకుపోతుంటే రైతులు తల్లడిల్లిపోయారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తూకం వేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)/శివ్వంపేట



కౌడిపల్లి: ధర్మాసాగర్‌లో వర్షం నీటిలో ధాన్యం

న్యూస్‌రీల్

కాంగ్రెస్ పతనం ప్రారంభం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్ పతనం ప్రారంభం కాబోతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఈనెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభ సన్నాహ క సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధనే ఏకైక ఎజెండాగా ఏర్పడిన గులాబీ పార్టీ 25 ఏళ్లుగా ప్రజల కోసమే పనిచేస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన ప్రజలకు మేలు చేసిందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనతోనే ప్రజలు విసిగిపోయారని, కేసీఆర్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు రాజు, లక్ష్మారెడ్డి, సుజాత, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



శరత్‌చంద్ర



హసన్

మెదక్‌జోన్: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఇద్దరు బాలురు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 14వ తేదీ నుంచి 16వ వరకు వనపర్తిలో జరిగిన అండర్– 14 బాలుర రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లా నుంచి పాల్గొన్న హసన్, శరత్‌చంద్ర మంచి ప్రతిభ కనబరిచారు. ఈనెల 25వ తేదీ నుంచి 29 వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి పాల్గొననున్నారు. జట్టులో మొత్తం 18 మంది క్రీడాకారులు ఉండగా, జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులకు చోటు దక్కడం గర్వకారణం అన్నారు. కాగా శరత్‌చంద్రది రామాయంపేట పట్టణం కాగా, హసన్ మెదక్ పట్టణానికి చెందిన బాలుడు.

సన్నబియ్యం నిరుపేదలకు వరం



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న సుహాసినిరెడ్డి, నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరంలాంటిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆరెగూడెంలో లబ్ధిదారుడు కొడె సత్తయ్య ఇంట్లో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి సన్నబియ్యం భోజనం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, సామాన్య ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేదలను దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, శేఖర్, సుధాకర్‌గౌడ్, మల్లేశం, నర్సింహారెడ్డి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌స్కిల్స్, ఏఐపై శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్ కలెక్టరేట్: సాఫ్ట్ స్కిల్స్, ఏఐపై మెదక్ డిగ్రీ కళాశాలలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ.. కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన లేదా తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థుల కోసం ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన యువత దీనికి అర్హులని, శిక్షణ పూర్తయిన తర్వాత వార్షికంగా రూ. 2 నుంచి 3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మే నెల సెలవు ఇవ్వండి

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మిని టీచర్లు అందరికీ మే నెల అంతా ఒకేసారి సెలవులు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలను ఇళ్లలో ఉంచడమే మంచిదన్నారు. కర్ణాటకలో మే నెల అంతా అంగన్‌వాడీ సెంటర్లకు వేసవి సెలవులు ప్రకటించారని గుర్తు చేశారు. లేదంటే టేక్ హోం రేషన్ ద్వారా ఇంటింటికీ సరుకులు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు మల్లేశం సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ ,తదితరులు పాల్గొన్నారు.

ఈత.. కారాదు కడుపు కోత

తల్లిదండ్రులూ ఓ కన్నేయండి



మెదక్‌జోన్: పిల్లలకు వేసవి సెలవులు రావడంతో సంతోషంతో ఎగిరి గంతులు వేస్తున్నారు. కొందరు అమ్మమ్మ ఇంటికి వెళ్తే.. మరికొందరు సరదాగా గడిపేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. దీంతో యువకులు చెరువులు, కుంటల వైపు పరుగులు పెడుతున్నారు. ఈత కొడుతూ కేరింతలు కొడుతున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పిల్లలను ఓ కంట కనిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

మూడేళ్లలో 25 మంది మృత్యువాత

వేసవి సెలవులు రావటంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు అత్యధికంగా ఈతకోసం వెళ్తుంటారు. ప్రస్తుతం వరి కోతలు.. ఉపాధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. పెద్దలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల్లో నిమగ్నం అవుతున్నారు. పిల్లలు చెరువులు, కుంటలు, వాగుల్లోకి ఈత కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడుతుంటారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పిల్లలను ఓ కంట కని పెట్టాల్సిన అవసరం ఉంది. గడిచిన మూడేళ్లలో జిల్లాలో పాతిక మందికి పైగా యువకులు ఈత కోసం వెళ్లి నీట మునిగి మృత్యువాత పడ్డారు. జిల్లాలో ఏడుపాయల ఆలయం వద్ద ఘనపూర్, మెదక్– కామారెడ్డి జిల్లాల సరిహద్దులో పోచారం ప్రాజెక్టు ఉంది. వీటిలో స్నానానికి దిగి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే మెదక్ మండలం బాలనగర్ శివారులో గల బొల్లారం మత్తడి ఏడాది పాటు నీటితో కనివిందు చేస్తుంది. మెదక్, హవేళిఘణాపూర్ మండలాలకు కెనాల్ ద్వారా సాగు నీరు పారుతుంది. గడిచిన ఆరు నెలల్లో ఈ మత్తడి ఆరుగురు యువకులను పొట్టన పెట్టుకుంది.

ప్రమాదాలకు ప్రధాన కారణాలు

చెరువులు, బావుల్లో నీటి లోతు తెలుసుకోకపోవడం, దరికి దూరంగా ఈత కొట్టుకుంటూ వెళ్లే క్రమంలో అలిసిపోవడం, అక్కడి నుంచి వెనుకకు వద్దామన్నా రాలేక.. ఊపిరాడక నీటిలో మునిగిపోతున్నారు. మద్యం మత్తులో ఈతకు వెళ్లే సందర్భాల్లోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నీటి ప్రవాహానికి ఎదురీదడం, చెరువులు, కాలువ, బావి గట్ల వద్ద సెల్ఫీలు దిగే సందర్భంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృత్యువాత పడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చిన్నారుల భద్రతను మరో చిన్నారిపై ఉంచొద్దు. తప్పనిసరిగా తండ్రి లేదా పెద్దవారు వెంట ఉండాలి. పిల్లల ఈతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. తల్లిదండ్రుల, పెద్దల అనుమతి తీసుకుని పూర్తిస్థాయి రక్షణ చర్యలు తీసుకున్న తర్వాతే ఈతకు వెళ్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే వెళ్లాలి. ఈత నేర్చుకునే సమయాల్లో గాలిట్యూబులు, ఇతర రక్షణ కవచాలను నడుముకు, హ్యాండ్ ట్యూబులు కట్టుకోవాలి. పెద్దలు, శిక్షకుల సమక్షంలోనే ఈత నేర్చుకోవాలి. నీటిలో అడుగు భాగాలకు వెళ్లి మట్టిని తేవడం, ఎవరు ఎక్కువ సేపు నీటిలో మునిగి ఉంటారనే పోటీలు, ఇతర ఆటలు ఆడవద్దు. నీటిలో ఎక్కువ సేపు మునిగి ఉండవద్దు.

పెద్దలు లేకుండా పిల్లలను పంపొద్దు



పెద్దలు లేకుండా పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో ఈత కోసం నీటి వనరుల్లోకి పంపకూడదు. జిల్లాలో ఈత కోసం వెళ్లి చనిపోతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈత నేర్పించాలి అనుకుంటే కోచ్‌కు అప్పగించాలి. లేదా పెద్దలు తీసుకెళ్లి నేర్పించాలి. ప్రతి ఆదివారం ఘనపూర్ ప్రాజెక్టు వద్ద పోలీస్ బందోబస్తు ఉంచుతున్నాం.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

కొత్త చట్టంలో రికార్డుల సవరణ

కలెక్టర్ రాహుల్‌రాజ్



వెల్దుర్తి: మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి(తూప్రాన్)/నిజాంపేట(మెదక్): రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్త చట్టంలో రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించిందన్నారు. సాదాబైనామా దరఖాస్తులు సైతం పరిష్కారం అవుతాయన్నారు. భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు వ్యవస్థ ఉందని, భూదార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలు, ఆబాది, రైతులకు ఉచిత న్యాయ సహాయం ఈ చట్టంలో పొందుపర్చారన్నారు. గ్రామ రెవెన్యూ రికార్డుల్లో మోసపూరితంగా నమోదై ఉంటే వాటిని రద్దు చేస్తామన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ వల్ల బడుగు, బలహీనవర్గాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ కృష్ణ, మండల ప్రత్యేక అధికారిణి నీలిమ, ఎంపీడీఓ ఉమాదేవి, ఏఓ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. అలాగే నిజాంపేటలో ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కొత్త చట్టంతో చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, డీపీఆర్ఓ రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.


రైతులు ఎలాంటి ఇబ్బంది పడొద్దు

అదనపు కలెక్టర్ నగేష్



నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

టేక్మాల్(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం మండలంలోని ఎలకుర్తి, చల్లపల్లి గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొల్లు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే మిల్లర్లకు పంపాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. ధాన్యం పూర్తిగా ఆరిన తర్వాతే తూకం చేయాలని చెప్పారు. లారీలు, గన్నీ బ్యాగుల కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లోనే ధాన్యం తూకం చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



కొత్త రేషన్ కార్డులు ఎప్పుడో?

అయోమయంలో దరఖాస్తుదారులు

మెదక్ కలెక్టరేట్: కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇటీవల ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ యువవికాసం వంటి పథకాలు ప్రవేశపెట్టడంతో దరఖాస్తుదారుల్లో మరింత ఆతృత పెరిగింది. తమకు రేషన్‌కార్డులు ఎప్పుడొస్తాయన్న ఆందోళన నెలకొంది. రేషన్‌కార్డు ప్రమాణికం కావడంతో సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో..

ప్రభుత్వం గతేడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా రేషన్‌కార్డుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. కానీ ఇప్పటికీ కొత్త కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయలేదు. ఇటీవల కార్డులు జారీ అయినట్లు వచ్చిన జాబితాలపై అధికారులు మరో మారు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు తల్లిదండ్రుల పేరిట ఉన్న కార్డుల్లో ఉన్న వారు పెళ్లి చేసుకొని భార్య పిల్లలతో కలిసి కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రుల పేర ఉన్న కార్డుల్లో తమ పేర్లను తొలగించుకున్నారు. కొత్త కార్డు రాక, పాత కార్డులో పేరు లేక పోవడంతో రేషన్ బియ్యానికి, రాజీవ్ యువ వికాసం వంటి సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. దీంతో చాలా మంది రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 2,13,828 రేషన్‌కార్డులు ఉండగా, 522 రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు.

మీసేవ ద్వారా 1,816 దరఖాస్తులు

ఇటీవల జిల్లావ్యాప్తంగా 21 మండలాలకు నుంచి మీ సేవ ద్వారా కొత్త కార్డుల కోసం 1,816 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటితో పాటు ప్రజా పాలన ద్వారా 35,831 దరఖాస్తులు స్వీకరించారు. అందులో 2,488 దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తికాగా, మరో 33,343 దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది. అయితే చాలా వరకు కొత్తగా పెళ్లి అయిన యువత తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటూ కొత్తకార్డుల కోసం అప్లయ్ చేసుకున్నారు. మరికొంత మంది తమ పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో చేర్చాలని అర్జీలు సమర్పించారు.

పథకాలకు దూరమయ్యాం



కొత్తకార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే తల్లిదండ్రుల పేర ఉన్న కార్డులో పేరు పోయింది. కాని ఇప్పటి వరకు కొత్తకార్డు మాత్రం రాలేదు. 2019లో పెళ్లి జరగగా భార్య పిల్లలు ఉన్నారు. పాతకార్డుపై బియ్యం రావడం లేదు. ప్రస్తుతం రేషన్‌కార్డు లేకపోవడంతో ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదు.

– శ్రీనివాస్, కప్రాయిపల్లి, హవేళిఘణాపూర్

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం

జిల్లావ్యాప్తంగా కొత్త కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా 1,816 దరఖాస్తులు రాగా.. ప్రజాపాలనాలో 35,831 దరఖాస్తుల వచ్చాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతుంది. త్వరలోనే ప్రభుత్వం అర్హులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేసే అవకాశం ఉంది.

– సురేష్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

మహిళా పారిశ్రామికవేత్తల కోసం ‘వీ హబ్’

డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు



కార్యక్రమానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

మెదక్ కలెక్టరేట్: స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామిక వేత్తలకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు నెలకొల్పడానికి వీ హబ్ చేయూతనిస్తుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలకు ‘ర్యాంప్’ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా కొనసాగనున్న ఈ ప్రోగ్రాంలో ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలు తమ బిజినెస్‌ను వేగవంతం చేసుకొని ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం వ్యాపారులకు పలు రంగాలకు సంబంధించి బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ ఉంటుందన్నారు. అలాగే యువ విద్యార్థులకు కోసం స్కిల్ డెవలప్‌మెంట్, కెరీయర్ రెడినీస్ కోసం వీ హబ్ నిర్వహిస్తున్న ‘ఐ లీప్’ క్యాంపస్ ప్రేణ్యూర్ కార్యక్రమంపై వివరించారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రిన్సిపాల్ సోమనాథ శర్మ

పటాన్‌చెరు టౌన్: డిగ్రీలో అడ్మిషన్లకు దరఖాస్తులు కోరుతున్నారు. మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో ఇంటర్ పూర్తి చేసిన గిరిజన విద్యార్థులు పెద్దకంజర్లలో అడ్మిషన్ తీసుకోవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సోమనాథ శర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన, ఎస్సీ, బీసీ విద్యార్థులకు అడ్మిషన్లు గురుకుల నియమ నిబంధనలకు లోబడి అడ్మిషన్ కల్పించనున్నట్లు చెప్పారు. అడ్మిషన్ కోసం నేరుగా కళాశాలను సంప్రదించాలని కోరారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచిత భోజన వసతి, విద్య, యూనిఫాం, ఉచిత ఎగ్జామినేషన్ ఫీజు అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 94948 24692, 80080 70959 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

టూరిస్టులపై ఉగ్రదాడి అమానుషం



రామాయంపేటలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

మెదక్‌జోన్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. గురువారం టీఎన్జీఓ భవన్‌లో అత్యవసర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. దేశంలో మతాల మధ్య ఐక్యతను చెదరగొట్టి మత చిచ్చు పెట్టాలన్నదే ఉగ్రవాదుల అభిమతమన్నారు. తమ దేశంలోని కాశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులు పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి పహల్గాం అమరులకు జోహార్ అంటూ నినదించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా సహ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాష, ఉపాధ్యక్షులు ఫజులుద్దీన్, కోటి రఘునాథరావు, సంయుక్త కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

రామాయంపేట(మెదక్): ఉగ్రదాడికి నిరసనగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రామాయంపేటలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్య నారాయణ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి ర్యాలీని ప్రారంభించారు. వీహెచ్‌పీ ప్రతినిధులతో పాటు బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తప్పుడు వార్తలు ప్రచారం చేసిన యూట్యూబర్‌పై కేసు నమోదు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): తప్పుడు వార్తలు రాసిన యూట్యూబర్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ కథనం ప్రకారం... మండలంలోని కాళ్లకల్‌ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రియాంక అక్రమంగా అనుమతులు ఇచ్చిందని, రెచ్చగొట్టేలా, ఓ యూట్యూబ్‌ చానల్‌లో పార్ట్‌ 1, పార్ట్‌ 2 పేరిట ఓబులేసు లింగంగౌడ్‌ అనే వ్యక్తి టెలికాస్ట్‌ చేశాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి


బలవంతరెడ్డి (ఫైల్‌)

ములుగు(గజ్వేల్‌): ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం తున్కిబొల్లారంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బద్దం బలవంతరెడ్డి(34) వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం ఉదయం వ్యవసాయ పొలం వద్దగల నీటి సంపులో బోరు మోటరు నడవక పోవడంతో సంపులోకి తొంగి చూస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ఇది గమనించిన తమ్ముడు కోటిరెడ్డి విషయాన్ని తన తండ్రి బుచ్చిరెడ్డికి తెలుపగా వారిరువురు కలిసి బలవంతరెడ్డిని నీటి సంపులోనుంచి పైకి తీసి చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. అతడికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య అనూష ఇద్దరు పిల్లలున్నారు.

పిట్టగోడ కూలి గర్భిణి మృతి

- వర్షం వస్తుందని దాబా దగ్గర ఆగిన భార్యాభర్తలు..
- టీ తాగుతుండగా గోడ కూలి ప్రమాదం


శ్రావణి

మునిపల్లి(అందోల్‌): పిట్టగోడ కూలడంతో ఓ గర్భిణి మృతి చెందింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరాలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని పొల్కంపల్లికి చెందిన మన్నె విజయ్‌, ఆయన భార్య శ్రావణి (గర్భిణి) సదాశివపేట ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి తిరిగి వస్తున్నారు. బుదేరా గ్రామానికి సమీపంలోకి రాగానే ఈదురు గాలులు, వర్షం రావడంతో భార్యాభర్తలు ఓ దాబా దగ్గర ఆగి టీ తాగుతున్నారు. అదే సమయంలో దాబా రేకుల షెడ్డు ముందు భాగంతో పాటు పిట్టగోడ కూలి శ్రావణిపై పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలొదిలింది. కేసు దర్యాప్తులో ఉంది.

మద్యం తాగి కిందపడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు వివరాల ప్రకారం... నాగర్‌కర్నూలు జిల్లా అంబటిపల్లికి చెందిన ఊషయ్య(45) తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం ఇంద్రపురి కాలనీలో ఉంటూ కూలీ పని చేస్తున్నాడు. ఈనెల 13న మద్యం తాగి కింద పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. పక్కనే ఉన్న మేస్త్రి ఇంటికి తీసుకొచ్చి వదిలిపెట్టాడు. అనంతరం అతనికి తలనొప్పి రావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు సీటీ స్కాన్‌ చేసి బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టిందని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. దీంతో 23న ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్‌

కౌడిపల్లి(నర్సాపూర్‌): కౌడిపల్లి అటవీశాఖ రేంజ్‌ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎఫ్‌ఆర్‌ఓ అర్చన, సిబ్బంది గురువారం సీజ్‌ చేశారు. జలాల్‌పూర్‌, జాకంపల్లి తండాల్లోని అడవిలోని వాగుల నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సీజ్‌చేసి రేంజ్‌ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.


సీజ్‌చేసిన ట్రాక్టర్లు

వరికోత.. కన్నీటి వెత



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దుబ్బాకకు చెందిన కేసుగారి స్వామి. తనకున్న 12 ఎకరాల్లో ఈ యాసంగిలో వరి వేశాడు. తీరా వరి కోద్దామంటే వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు చేలలో నీరు నిలిచిపోయింది. దీంతో తప్పనిసరి పరిస్థితిలో చైన్‌ హార్వెస్టర్‌తో కోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా 12 ఎకరాలు కోసేందుకు కామన్‌ హార్వెస్టర్‌తో 14 గంటలు పట్టేది. ఇప్పుడు చైన్‌ మిషన్‌తో కోస్తే 18 గంటలకు పైగా సమయం పట్టింది. వరి కోసి వడ్లను రోడ్డు పైకి తెచ్చి ట్రాక్టర్‌లో పోయాల్సి రావడంతో అదనంగా 5 గంటలకు పైగా సమయం ఎక్కువైంది. పైగా కామన్‌ హార్వెస్టర్‌కు గంటకు రూ.2 వేలు ధర ఉంటే చైన్‌ మిషన్‌కు రూ.3 వేలకు పైగా ఉంది. దీంతో రూ.26 వేలలో పూర్తి కావాల్సిన కోతకు రూ.50 వేలకు పైగా అంటే అదనంగా రూ.24 వేలు అదనపు భారం పడింది. ప్రతిసారి వడ్లు 20 ట్రాక్టర్లకు పైగా అంటే 350 క్వింటాళ్ల వరకు అయ్యేవి. ఇప్పుడు తక్కువయ్యాయి. ఇది ఒక్క రైతు స్వామిదే కాదు చాలామంది రైతులది ఇదే పరిస్థితి.


వరికోస్తున్న చైన్‌మిషన్‌

- రైతులను కోలుకోకుండా చేస్తున్న అకాల వర్షాలు
- భూమిలో తేమతో దిగబడుతున్న హార్వెస్టర్లు
- చైన్‌మిషన్లతో వరి కోతలు
- ఎకరానికి రూ.5 వేలకు పైగా అదనపు భారం
- జిల్లాలో ఇప్పటి వరకు 45 శాతం కోతలు

వరి కోసేందుకు నరకయాతన

దుబ్బాక: అసలే యాసంగిలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు వట్టిపోయి చాలా పంటలు ఎండిపోయాయి. ఇక పంట చేతికొస్తదనుకున్న దశలోనే జిల్లాలో వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వడగండ్లతో వడ్లు చాలా వరకు వడ్లు రాలిపోవడంతో రైతులకు కనీస పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి దాపురించింది. పోగా మిగిలిన గింజలను కోద్దామంటే వారం పదిరోజులుగా వరుసగా పడుతున్న వానలకు పొలాలు ఆరక దిగబడుతుండటంతో కోతలకు ఇబ్బంది అవుతోంది. దీంతో వరి కోసేందుకు రైతులు నరకయాతన పడుతున్నారు. టైర్‌ హార్వెస్టర్లు దిగబడుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ ధర పెట్టి చైన్‌ మిషన్లతోనే కోతలు కోయించాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లాలోని ఒక్క దుబ్బాకనే కాకుండా సిద్దిపేట, గజ్వేల్‌, హుస్నాబాద్‌ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో వరి కోతలు కోసేందుకు రైతులు నరకయాతన పడుతున్నారు.

జిల్లాలో 45 శాతానికి పైగా వరికోతలు

జిల్లాలో ఈ యాసంగిలో 3.53 లక్షల ఎకరాల్లో వరి పంట వేయగా ఇప్పటి వరకు 45 శాతం వరకు అంటే సుమారుగా 1.45 లక్షలకు పైగా ఎకరాల్లో కోతలు కోయడం పూర్తయింది. ఇంకా 55 శాతం వరకు కోతలు కోయాల్సి ఉంది. కోసిన కోతల్లో 20 శాతం వరకు చైన్‌మిషన్లు, ఫోర్‌వీల్‌తోనే కోశారు. దీంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

రైతులపై అదనపు భారం

పొలాలు దిగబడుతుండటంతో చైన్‌మిషన్‌తో కోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హార్వెస్టర్‌కు గంటకు రూ.2వేలు ఉండగా చైన్‌ మిషన్‌ గంటకు రూ.3వేల నుంచి 3500 వరకు ధర చెల్లించాల్సి వస్తోంది. పొలాలు దిగబడుతుండటంతో వడ్లు పోసేందుకు ట్రాక్టర్లు రాలేని పరిస్థితి ఉంది. సాధారణంగా ఎకరం వరికోతకు టైర్‌ హార్వెస్టర్‌తో గంట 10 నిమిషాల నుంచి 1.20 పడుతుండగా చైన్‌ మిషన్‌తో ఎకరం వరికోసి వడ్లు బయట పోయాల్సి వస్తుండటంతో 2 గంటలకు పైగా సమయం పడుతోంది. అంతేకాకుండా చైన్‌మిషన్‌కు రేటు కూడా ఎక్కువ ఉండటంతో ఎకరానికి రైతుకు అదనంగా 5 నుంచి 6 వేల వరకు భారం పడుతోంది. రైతులు చైన్‌మిషన్‌తోనే కోయిస్తుండటంతో అవి దొరకక ప్రతిరోజు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చైన్‌మిషన్‌తో కోయించా..



వరుసగా వానలు పడటంతో కోత కొచ్చిన వరిపంట కోసేందుకు చాలా ఇబ్బందులు పడ్డా. వానలతో భూమి ఆరలేదు. మళ్లీ వాన వానలు వస్తుండటంతో ఎక్కువ డబ్బులు పోయినా ఉన్న పంటను దక్కించుకోవాలనే చైన్‌మిషన్‌తో కోయించా. నేనే కాదు రైతులందరూ చైన్‌మిషన్‌, ఫోర్‌వీల్‌తోనే కోయించుకుంటున్నారు.

– గన్నె వెంకట్రాజిరెడ్డి, రైతు

అకాల వర్షాలతో ఇబ్బందులు



తీరా పంటలు చేతికొచ్చే దశలో అకాల వర్షాలు రైతులను ఇబ్బందుల పాలుజేస్తున్నాయి. వడగండ్లు, ఈదురు గాలులతో కూడిన వర్షాలతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో రైతులకు పంట నష్టం వాటిల్లింది. ఈ అకాల వర్షాలతో కోసిన వడ్లు ఆరబోసేందుకు , వరి కోతలు కోసేందుకు కూడా అదనంగా ఖర్చులు అవుతున్నాయి.

– రాధిక,జిల్లా వ్యవసాయ అధికారి

బైక్‌ డీసీఎం ఢీ

- ఒకరికి గాయాలు

మిరుదొడ్డి(దుబ్బాక): బైక్‌, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మారం జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన మల్లేశం గౌడ్‌ సిద్దిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో రామాయంపేట నుంచి డీసీఎం సిద్దిపేట వైపు వెళ్తుండగా ధర్మారం శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్లేశం గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నిప్పంటుకొని గడ్డివాము దగ్ధం

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల పరిధిలోని చండి వ్యవసాయ పొలం వద్ద నిల్వ ఉంచిన గడ్డివాముకు (ఎండు పశుగ్రాసం) నిప్పంటుకొని దగ్ధమైన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హన్మంత్‌యాదవ్‌ తన పొలం వద్ద నిల్వ ఉంచిన గడ్డివాముకు నిప్పంటుకోవడంతో గుర్తించిన రైతులు నర్సాపూర్‌ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మంటలు ఆర్పివేసినప్పటికీ అప్పటికే పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. కావాలనే గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారని బాధిత రైతు హన్మంత్‌యాదవ్‌ ఆరోపించారు. ఈ ఘటనలో 800 గడ్డి కట్టలు దగ్ధం కావడంతో రూ.70 వేల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

కేదార్‌నాథ్‌ యాత్రికులకు దక్షిణాది రుచులు

- నేడు వెళ్లనున్న సరుకుల లారీలు
- కేదారినాథ్‌ అన్నదాన సేవా సమితి సభ్యులు వెల్లడి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేదారినాథ్‌ అన్నదాన సేవా సమితి సభ్యులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్‌కు సరుకుల లారీలను శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని శరభేశ్వర ఆలయం నుంచి పంపించనున్నట్లు కేదారినాథ్‌ అన్నదాన సేవా సమితి సభ్యులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఐదేళ్లుగా కేదార్‌నాథ్‌ యాత్రికులకు దక్షిణాది రుచులను అందిస్తూ, యాత్రికులకు ఇతర సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. మే 2 నుంచి యాత్ర ప్రారంభమవుతుందని, అక్కడికి వచ్చే భక్తులకు ఉదయం టీ, టిఫిన్‌, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్‌, టీ, రాత్రి భోజనం అందించనున్నామని చెప్పారు. శుక్రవారం శరభేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, శివకళ్యాణం నిర్వహించి, లారీలను కేదార్‌నాథ్‌కు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మాంకాల నవీన్‌కుమార్‌, మధుసూదన్‌, రత్నాకర్‌, శరభయ్య, కాశీనాథ్‌, గంజి రాములు, రాజేంద్ర ప్రసాద్‌, శ్రీనివాస్‌, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి ట్రాక్టర్‌ చోరీ..

- అంతర్‌జిల్లా దొంగను పట్టుకున్న త్రీటౌన్‌ పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు


నేరస్తుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేటఅర్బన్‌: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌ జిల్లా దొంగను గురువారం సిద్దిపేట త్రీటౌన్‌ పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట ఏసీపీ మధు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కామారెడ్డి జిల్లా ఇస్సానగర్‌కు చెందిన చెవుల మల్లేశం (40) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ వ్యవసాయం చేస్తున్నాడు. కుటుంబ పోషణ భారం కావడంతో జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు చేస్తున్నాడు. తన సమీప గ్రామాల్లో దొంగతనం చేస్తే పోలీసులకు దొరికిపోతాననే భయంతో దూర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతూ ముందు రోజు రెక్కీ నిర్వహించి అనంతరం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో కొండపాక మండలం మర్పడగ మధిర దోమలోనిపల్లి గ్రామంలో దోమల మల్లయ్య వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాక్టర్‌ ట్రాలీని అపహరించాడు. అంతకుముందు ఫిబ్రవరి 12న రాంపల్లి గ్రామ శివారులోని బొమ్మ నర్సయ్య పొలం వద్ద నిలిపి ఉంచిన జాన్‌డీర్‌ ట్రాక్టర్‌ను ట్రాలీతో సహా దొంగిలించి తన స్వగ్రామంలోని వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లాడు. ట్రాక్టర్‌ను గుర్తు పట్టకుండా నంబర్‌ ప్లేట్‌కు రంగులు వేసినట్టు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడానికి త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌ ప్రత్యేక బృందంతో నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో సెలంపు గ్రామ శివారులో ట్రాక్టర్‌ ఇంజిన్‌తో సహా ప్రయాణిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి జాన్‌ డీర్‌ ట్రాక్టర్‌ ఇంజిన్‌, రెండు ట్రాలీలు, మోటార్‌ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నేరస్తుడు పలు పోలీస్‌ స్టేషన్ల పరిధిలో 15 దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌, సిబ్బంది తిరుపతిరెడ్డి, బాబు, శ్రీనివాస్‌లను ఏసీపీ అభినందించారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కలెక్టర్‌ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్‌: స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రాజీవ్‌ యువ వికాసానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్‌ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్‌ హాలులో సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ శాఖల ద్వారా దాదాపు 60వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శాఖల వారీగా అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. శుక్రవారం మండల స్థాయిలో ఎంపీడీఓలు, బ్యాంకర్లు సమావేశం నిర్వహించి దరఖాస్తుల పరిశీలన చేయాలన్నారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేసి జాబితాను మే 21 లోపు కలెక్టర్‌ కార్యాలయంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం హరిబాబు, డీఆర్‌డీఓ జయదేవ్‌ ఆర్యా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెట్విన్‌, పరిశ్రమల శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అడుగంటిన నీరు..


రంగంపేట శివారు తురకల చెరువులో అడుగంటి పోతున్న నీరు

మండుతున్న ఎండలతో మండలంలో ఏ చెరువు, ఏ కుంట చూసినా నీరు అడుగంటి కనిపిస్తున్నాయి. గడిచిన వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, ఉన్న కొద్దిపాటి నీటిని పంటలు ఎండిపోతున్నాయని రైతులు మోటర్లతో పంటలకు నీరందించారు. దీంతో నీరు దొరక్క మూగజీవాలు అల్లాడుతున్నాయి. గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిన మండలాల్లో కొల్చారం మొదటి స్థానంలో ఉంది. మునుముందు ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. – కొల్చారం(నర్సాపూర్‌)

తాళం వేసిన ఇంట్లో చోరీ

హుస్నాబాద్‌: పట్టణంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హుస్నాబాద్‌ పట్టణంలోని ఎల్‌ఐసీ కాలనీకి చెందిన వెంకటస్వామి తన ఇంటికి తాళం వేసి పనుల నిమిత్తం ఊరికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న 8 గ్రాముల బంగారం, 10 తులాల వెండి, కొంత నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులకు సమాచారం అందించగా క్లూస్‌ టీమ్‌ సభ్యులు వచ్చి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


కృష్ణవేణి(ఫైల్‌)

నర్సాపూర్‌ రూరల్‌: యువతి అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌ మండలం లింగాపూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కంచర్ల నారాయణ కూతురు కంచర్ల కృష్ణవేణి (19)ఈనెల 23న తల్లి చంద్రకళతో కలిసి నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వచ్చారు. తల్లి ఆస్పత్రి లోపల బంధువులను పరామర్శిస్తుండగా కృష్ణవేణి బయటకు వచ్చి కనపడకుండా పోయింది. చుట్టుపక్కల తల్లి, బంధువులు వెతికినా కనిపించలేదు. గురువారం తండ్రి నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిద్రిస్తున్న యువకుడి పైనుంచి..


కరుణాకర్‌(ఫైల్‌)

మర్కూక్‌(గజ్వేల్‌): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ యువకుడిపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మర్కూక్‌ మండలంలోని కర్కపట్ల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ దామోదర్‌ వివరాల ప్రకారం... కర్కపట్ల గ్రామానికి చెందిన కరుణాకర్‌ (24) అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ వద్ద క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీకాంత్‌ తన టిప్పర్ల ద్వారా ప్రతి రోజు గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి సమయంలో గ్రామంలో నుంచి మట్టిని హైదరాబాద్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి 12గంటల తర్వాత మూడు టిప్పర్లు, 2 జేసీబీల సహాయంతో కర్కపట్ల గ్రామానికి చెందిన గ్యార మల్లేశం ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తరలిస్తున్నాడు. తన వద్ద క్లీనర్‌గా పనిచేస్తున్న కరుణాకర్‌ నిద్రరావడంతో కొద్దిసేపు పడుకుంటానని చెప్పి వెళ్లి పక్కన నిద్రిస్తున్నాడు. డ్రైవర్‌ నిర్లక్ష్యంతో అజాగ్రత్తగా అతడి ఛాతీపై నుంచి టిప్పర్‌ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కరుణాకర్‌ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేణికుంట రోడ్డు ప్రమాదంలో...

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్‌ జిల్లా తిమ్మాపూర్‌ మండలంలోని రేణికుంట వద్ద గల రాజీవ్‌ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌కు చెందిన బి.నక్షత్రమ్మ మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో బెజ్జంకిలో విషాదఛాయలు అలుముకున్నాయి. నక్షత్రమ్మ భర్త ఆనందరెడ్డికి తీవ్ర గాయాలు కాగా, హుస్నాబాద్‌ ఆర్టీఓ కార్యాలయంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కొలిపాక మంజుల, బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన ఐలేని నవీన్‌రెడ్డిలకు కాలు ఫ్రాక్చరైంది. వీరు కరీంనగర్‌ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కారు ఢీకొట్టిన ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం


సంద గణేశ్‌(ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): బైకును వెనక నుంచి కారు ఢీకొట్టడంతో బైకిస్టు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం వర్గల్‌ మండలం సింగాయపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రాజీవ్‌ రహదారిపై జరిగింది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... మర్కూక్‌ మండలం ఎర్రవల్లికి చెందిన సంద గణేశ్‌(40)కు భార్య పద్మ, 14 యేళ్లలోపు మనోజ్‌, మానస అనే ఇద్దరు పిల్లలున్నారు. పిల్లల చదువుల కోసం గజ్వేల్‌లో ఉంటూ టిప్పర్‌, జేసీబీ పనులు చూసుకుంటున్నాడు. గురువారం సాయంత్రం బైక్‌పై గజ్వేల్‌ నుంచి గౌరారం వైపు వస్తున్నాడు. సింగాయపల్లి క్రాస్‌ రోడ్డు వద్ద వెనక నుంచి కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. అతడిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులే మరణ శాసనమై..

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల నలుగురు పలు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు.

సిద్దిపేటకమాన్‌: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. వన్‌టౌన్‌ పోలీసుల కథనం ప్రకారం... సిద్దిపేట పట్టణం రాంనగర్‌కు చెందిన మండల నరేశ్‌(32) కొన్నేళ్లుగా అస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కూలీ పనులు చేసుకునే అతడికి ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో మనస్తాపానికి గురై పట్టణ శివారు ఎర్ర చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు ముందు అతడు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు భార్యకు ఫోన్‌ చేసి చెప్పాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..


జాంగిర్‌ నాయక్‌ (ఫైల్‌)

నర్సాపూర్‌ రూరల్‌: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్సై లింగం కథనం ప్రకారం... నర్సాపూర్‌ మండలం ఎల్లారెడ్డి గూడ గిరిజన తండాకు చెందిన సేనావత్‌ జాంగిర్‌ నాయక్‌ (35) తనకు ఉన్న 20 గుంటల భూమితో పాటు ఇతరుల వద్ద కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపానికి గురై ఈనెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు నర్సాపూర్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మతిస్థిమితం లేని వివాహిత..


లక్ష్మి (ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): మతిస్థిమితం లేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. త్రీ టౌన్‌ సీఐ.విద్యాసాగర్‌ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన లక్ష్మి (56)కి కొన్ని నెలలుగా మతిస్థిమితం లేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతుకుతున్న క్రమంలో ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా భూమి హద్దు కోసం పాతిన ఎత్తైన గనేట్‌ రాయికి ఉరేసుకొని చనిపోయింది. మృతురాలికి భర్త, కొడుకు, కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులబాధతో యువకుడు..


భాస్కర్‌ (ఫైల్‌)

తొగుట(దుబ్బాక): అప్పుల బాధతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేటలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మన్నె భాస్కర్‌ (29) డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగు ఏళ్ల క్రితం భార్య మహేశ్వరి మృతి చెందింది. తీవ్ర మనోవేదనకు గురై పనికి వెళ్లకుండా ఇంటివద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంటిపై ప్రైవేట్‌ ఫైనాన్స్‌లో రూ 3.25లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చాలని ఒత్తిడి తీసుకురావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి అంజవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత..

జిన్నారం (పటాన్‌చెరు): అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గుమ్మడిదల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని కానుకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి వివరాల ప్రకారం ... మెదక్‌ జిల్లా రామయంపేటకు చెందిన రేష్మా బేగంను (30) కానుకుంట గ్రామానికి చెందిన ఎండి అహ్మద్‌ 2019లో వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులు బాగానే ఉన్నారు. ఆ తర్వాత భర్త అహ్మద్‌, అత్త భాను, బావ సలీం, చిన్న మామ పాషాలు కలిసి అదనపు కట్నం తీసుకురావాలని రేష్మ భేగంను మానసికంగా వేధింపులకు గురిచేశారు. ఈ విషయాన్ని తల్లి దండ్రులకు తెలుపడంతో ఈనెల 16న పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మరోమారు గొడవ పడటంతో 22వ తేదీన పెద్దల సమక్షంలో మాట్లాడి ఒప్పించారు. దీంతో అత్తారింటికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఇద్దరు కొడుకుల మణికట్టుపై గాయపరిచి రేష్మా బేగం బెడ్రూంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలోఉన్న ఇద్దరి పిల్లలను ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. అత్తింటి వేధింపులతోనే మృతి చెందిందని సోదరుడు సల్మాన్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.